## దరఖాస్తులకు ఆహ్వానం

వికారాబాద్, సెప్టెంబర్ 18: ప్రభుత్వ వైద్య కళాశాలలో సీనియర్ రెసిడెంట్‌లకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లికార్జున్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23వ తేదీన ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించే ఇంటర్వ్యూలకు నేరుగా సంబంధిత ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు జిరాక్స్ కాపీలతో హాజరు కావాలన్నారు. వివిధ విభాగాల్లో (57) సీనియర్ రెసిడెం ట్స్ పోస్టులకు సంబంధించి https:// gm-cvikarabad.org/ వెబ్ సైట్ ద్వారా తెలుసుకోవచ్చని ఆయన తెలిపారు. ఉద్యోగాలకు గౌరవ వేతనం కింద చెల్లించబడుతుందని సూచించారు.

### మాడల్ స్కూల్‌లో...

బంట్వారం, సెప్టెంబర్18 : బంట్వారం మండల కేంద్రంలో ఉన్న తెలంగాణ మాడల్ స్కూల్‌లో ఖాళీ ఉన్న టీచింగ్ స్టాఫ్ పోస్టులకు అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బ్యూలా బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. పీజీటీ పోస్టులకు పీజీతో పాటు బీఎడ్, టీజీటీ పోస్టుకు డిగ్రీతో పాటు బీఎడ్ అర్హతలు ఉండాలన్నారు. పీజీటీ పోస్టులు తెలుగు (1), ఇంగ్లిష్ (2) గణితం(2), ఫిజిక్స్ (1), బాటనీ(1), సివిక్స్ (1) పోస్టులు ఖాళీ ఉండగా, టీజీటీ హిందీ ఒకటి ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ పోస్టులు అవర్లీ బేస్డ్ పద్ధతిలో ఉంటుందన్నారు. అర్హులైన వారు, ఆసక్తి ఉంటే మాడల్ స్కూల్‌లో బయోడేటాతో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు

## నేడు పార్టీలతో సమావేశం

పెద్దేముల్, సెప్టెంబర్ 18 : మండల పరిషత్ కార్యాలయంలో గురువారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో మండల స్థాయి ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనున్నట్లు మండల ఎంపీడీవో జర్నప్ప బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న గ్రామ పంచాయతీ 2వ సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఈ నెల 13న మండల పరిషత్ కార్యాలయంతో పాటు పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామ పంచాయతీల వార్డులవారీ ఓటర్ల ముసాయిదా జాబితాలను ప్రదర్శించినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ వార్డు వారి ఓటర్ల అమరికలపై అభ్యంతరాల స్వీకరణను ఈనెల 14 నుంచి 21 వరకు ఉంటుందని, ఈ నెల 26న జిల్లా పంచాయతీ అధికారిచే అభ్యంతరాల పరిష్కారం, ఈ నెల 28న జిల్లా పంచాయతీ అధికారిచే గ్రామ పంచాయతీ వార్డులవారీ ఓటర్ల తుది జాబితాను ప్రదర్శించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. ఈ సమావేశానికి అన్ని పార్టీల ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

## ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌గా శ్రీదేవి



తాండూరు రూరల్, సెప్టెంబర్ 18: తాండూరు మండలం, ఐనెల్లి(జినుగుర్తి) ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌గా శ్రీదేవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పూడూర్ ఆదర్శ పాఠశాలలో విధులు నిర్వహించారు. బదిలీపై ఐనెల్లి పాఠశాలకు వచ్చారు.

# ముమ్మరంగా స్వచ్ఛతాహీ సేవా

• విద్యార్థులకు వ్యాస రచన, క్విజ్ పోటీలు • మానవహారాలు ఏర్పాటు • ప్రతిజ్ఞ చేయించిన ఉపాధ్యాయులు



పెద్దేముల్ : కందనెల్లి గ్రామంలో విద్యార్థులతో మానవహారం



యాలాల: ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

బొంరాస్‌పేట, సెప్టెంబర్ 18 : స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాల్లో భాగంగా బుధవారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు, వ్యాస రచన పోటీలు నిర్వహించి మానవ హారాలు ఏర్పాటు చేశారు. పాఠశాల పరిసరాలతో పాటు తరగతి గదులు, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉపాధ్యాయులు సూచించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

**పెద్దేముల్:** మండల పరిధిలోని కందనెల్లి గ్రామ పంచాయతీలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో స్వచ్ఛతా ర్యాలీ, మానవహారం, ప్రతిజ్ఞను చేయించారు.ఈ సందర్భంగా మండల ఎంపీవో రతన్ సింగ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంటి లోపల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సీజనల్, అంటువ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేశ్ కుమార్, విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**యాలాల:** మండల పరిధిలోని అగ్గనూరు గ్రామంలో, జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో ఎంపీవో, గ్రామ ప్రత్యేక అధికారి యాదయ్య, ఎంఈవో సుధాకర్‌రెడ్డి, పాఠశాల ప్రధానో పాధ్యాయుడు సుధాకర్, పంచాయతీ కార్యదర్శి రమాదేవి విద్యార్థులకు అవగాహన కల్పిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. స్వచ్ఛతను ఓ జీవన విధానంగా మార్చుకుందామన్నారు. కార్యక్రమంలో ఉపా ధ్యాయులు కృష్ణారెడ్డి, రవీందర్, రాఘవేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



బొంరాస్‌పేట:మెట్లకుంట పాఠశాలలో మానవహారం

# పేదలందరికీ ప్రభుత్వ పథకాలు

**- చెక్కుల పంపిణీలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి**

కులకచర్ల, సెప్టెంబర్ 18 : కల్యాణలక్ష్మి పేదలకు వరంలా ఉపయోగపడుతున్నదని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు.బుధవారం కులకచర్ల మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలానికి చెందిన పలువురు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు అన్ని విధాలుగా ప్రభుత్వ పథకాలను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగు లయ్య, తహసీల్దార్ మురళీధర్, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, బ్లాక్ 2 అధ్యక్షుడు కర్రె భరత్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీఎస్ ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, నాయకులు రవీందర్‌నాయక్, అంజిలయ్యగౌడ్, నర్సింహానాయక్, శివరాంనాయక్, కాంగ్రెస్ పార్టీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్ పాల్గొన్నారు

### అర్హులైన ప్రతి రైతుకూ రుణమాఫీ

అర్హులైన ప్రతి రైతుకూ రుణమాఫీ అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో వివిధ శాఖల అధికారులకు, ప్రజాప్రతినిధులు, రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన రైతులు రుణమాఫీ కాలేదని చింత చెందవద్దని వ్యవసాయాధికారుల దగ్గరకు వెళ్లి వారి సమస్యలను తెలియజేయాలని సూచించారు. రెండు లక్షల వరకు రుణమాఫీ ప్రభుత్వం చేసిందని తెలిపారు, రెండు లక్షలపైన రుణాలు ఉన్న రైతులకు త్వరలో క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు అనంతరం కులకచర్ల మండల వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వ్యవసాయ శాఖ సమీక్ష నిర్వహించిన అనంతరం విద్యాశాఖ సమీక్ష నిర్వహించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అమ్మ ఆదర్శపాఠశాలలకు నిధులను మంజూరు చేసిందన్నారు. కులకచర్ల మండలంలోనే సుమారు నాలుగుకోట్ల వరకు పాఠశాలల మరమ్మతులకు నిధులను మంజూరు చేశామన్నారు. ఉపాధిహామీ, మహిళాసమాఖ్య, శ్రీశిశుసంక్షేమ శాఖ, విద్యుత్, మిగతా కార్యక్రమాలపై సమీక్షా నిర్వహించగా ఆయా శాఖల అధికారులకు ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడారు. గ్రామాల్లో సమస్యలను పరిష్కరించేందుకు పంచాయతీ కార్య దర్శులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు. ముఖ్యంగా గ్రామాల్లో ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యపు చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు.



కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

## ■ ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

బొంరాస్‌పేట, సెప్టెంబర్ 18 : మండలంలోని మహంతీపూర్ గ్రామానికి సమీపంలో ఉన్న కాకరవాణి వాగు నుంచి రోజూ ట్రాక్టర్లలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని, అధికారులు స్పందించి ఇసుక రవాణాను అడ్డుకోవాలని గ్రామానికి చెందిన రైతులు బుధవారం తహసీల్దార్ పద్మావతి, ఎస్సై అబ్దుల్ రవూఫ్‌కు వినతిపత్రం అందజేశారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక తరలింపుతో వ్యవసాయ బోర్లలో భూగర్భ జలాలు తగ్గి వ్యవసాయానికి ఇబ్బందులు ఎదురవుతాయని రైతులు వినతిపత్రంలో పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను ఆపాలని రైతులు కోరారు. కార్యక్రమంలో హన్మంతు, చంద్రయ్య, కిష్టయ్య, మొగులయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ పద్మావతికి వినతిపత్రం అందజేస్తున్న మహంతీపూర్ గ్రామస్తులు

## ■ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ



చెక్కులను అందజేస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

ధారూరు, సెప్టెంబరు 18: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అంచెలంచెలుగా అమలు చేస్తామని, రాష్ట్ర శాసన సభాపతి, వికారాబాద్ శాసన సభ్యుడు గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 30మంది కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు ఆయన చెక్కులను అందజేశారు.అంతకు ముందు మండల పరిధిలోని ఎబ్బనూరు గేటువద్ద దాతల సహకారంతో నిర్మించిన బస్టాప్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నర్సింహులు, తహసీల్దార్ షాజిదాబేగం, వ్యవసాయశాఖ అధికారి జ్యోతి, పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి, నాయకులు మాన్‌సింగ్, రాములు, విజయభాస్కర్ రెడ్డి, హన్మంత్ రెడ్డి, రాంరెడ్డి, రాజేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## ■ అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి



అధికారులతో సమీక్ష చేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, సెప్టెంబర్ 18: తాండూరు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో మరింత వేగం పెంచి సకాలంలో పనులు పూర్తి చేయాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నియోజకవర్గంలోని వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌హెచ్ 167 జాతీయ రహదారి, చిలుగ వాగుపై అధికారులు పూర్తి నిఘా పెట్టి నాణ్యతతో వేగంగా పనులు జరిగేలా చూడాలన్నారు. నర్సింగ్ కళాశాలతో పాటు జిల్లా ఆస్పత్రిలో ఎప్పటికప్పుడు సమస్యలను తెలుసుకుంటూ పరిష్కరించాలన్నారు. కావాల్సిన సదుపాయాలు కల్పించాలన్నారు. ఎవరూ ఎక్కడా నిర్లక్ష్యం చేయకుండా తాండూరు నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

## ■ రూ. లక్షా నాలుగువేలు పలికిన లడ్డూ..



కొడంగల్, సెప్టెంబర్ 18 : కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలంలోని హస్నాబాద్ గ్రామంలో వినాయకుడి లడ్డూ అధిక ధర పలికింది. మంగళవారం రాత్రి వినాయక నిమజ్జనంలో భాగంగా లడ్డూ వేలం పాట నిర్వహించారు. రూ. లక్షా నాలుగువేలకు ఆ గ్రామానికి చందిన మాజీ సైనికుడు నరహరిగౌడ్ దక్కించుకున్నారు. అదే విధంగా స్వామి వారి కలశాన్ని అల్లపురం రాములు రూ.31వేలు, శాలువాను పాతకొడంగల్ అంజనేయులు రూ.17వేలు. పండ్లు, ఫలాలను దోర నర్సప్ప రూ.18వేలకు అందుకున్నారు.

## ధర్మశాల స్థలాన్ని కాపాడాలి

కులకచర్ల, సెప్టెంబర్ 18 : కులకచర్ల పెద్ద గేటు చౌరస్తాలో ఉన్న ధర్మశాల స్థలాన్ని కాపాడేలా చర్యలు తీసుకోవాలని కులకచర్ల గ్రామస్తులు పరిగి ఎమ్మెల్యే రామ్మో హన్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. కులకచర్ల పెద్ద గేటు చౌరస్తాలో ఉన్న ధర్మశాల స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించుకున్నారని, గ్రామ పంచాయతీ రిజిస్టర్‌లో భూమి గ్రామ పంచాయతీ స్థలానిదేనని ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కులకచర్ల మాజీ ఎంపీటీసీ మాలె కృష్ణయ్య, గ్రామస్తులు రాజేశ్వర్, హరికృష్ణ పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివి

తాండూరు రూరల్, సెప్టెంబర్ 18 : ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ వైస్ చైర్మన్ రవీందర్‌గౌడ్ అన్నారు. బుధవారం తాండూరు ఎంపీడీవో కార్యాలయంలో జిల్లా, మండల ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో గురువులకు ప్రత్యేకమైన స్థానం ఉందన్నారు. గురువు చెప్పిన మార్గంలో విద్యార్థులు నడుచుకుంటే వారి భవిష్యత్తు బంగారుమయమవుతుందన్నారు. ఎంపీడీవో విశ్వప్రసాద్ మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల హాజరు శాతం పడిపోతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంఈవో వెంకటయ్యగౌడ్ మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయులపై మరింత బాధ్యత పెరిగిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి మృత్యుంజయస్వామి, హెచ్ఎంలు శివకుమార్, నర్స్యానాయక్, వైద్యనాథ్, పీఆర్టీయూ నాయ కులు జొన్నల వినోద్‌కుమార్, పురుషోత్తంరెడ్డి, కిష్టప్ప, జయపాల్‌రెడ్డి, నాగప్ప, యూటీఎఫ్ నాయకుడు నారాయణగౌడ్ ఉన్నారు.



జిల్లా, మండల ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

## ■ గిరి ప్రదక్షిణకు భారీగా భక్తులు..



కులకచర్ల, సెప్టెంబర్ 18: మండల పరిధిలోని బండవెల్కిచర్ల పాంబండ శ్రీ రామలింగేశ్వర స్వామి గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా నిర్వహించిన గిరిప్రదక్షిణ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం దేవాలయంలో శ్రీ రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు రెండు కిలోమీటర్ల మేర పాంబండ గిరి చుట్టూ ప్రదక్షిణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల భక్తులు, పూజారులు తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-331771-All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## ■ రైతుల సమస్యలు పరిష్కరించాలి



బొంరాస్‌పేట, సెప్టెంబర్ 18 : రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ప్రజా సంఘాల నాయకులు బుధవారం తహసీల్దార్ పద్మావతికి వినతిపత్రం అందజేశారు. రైతులకు ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని, మాఫీ అయిన రైతులకు కొత్తగా పంట రుణాలు ఇవ్వాలని, బొంరాస్‌పేట ఎస్‌బీఐలో సిబ్బంది సంఖ్యను పెంచాలని, రైతుల అకౌంట్లను హోల్డ్‌ల నుంచి తీసివేయాలని రైతులు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బ్యాంకు ఎదుట రెండు రోజులుగా రిలే దీక్షలు చేస్తున్నా అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని వారు పేర్కొన్నారు. రైతుల సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని ప్రజా సంఘాల నాయకులు తహసీల్దార్‌ను కోరారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ,మైనార్టీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సూర్యానాయక్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య, కేవీపీఎస్ నాయకుడు మల్కయ్య, ఉద్యమకారుల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, రమేశ్ బాబు, వెంకటయ్య, రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా నిమజ్జనోత్సవం



బొంరాస్‌పేట, సెప్టెంబర్ 18 : బొంరాస్‌పేట, మెట్లకుంట గ్రామాల్లో గణేశ్ నిమజ్జనం బుధవారం ఘనంగా నిర్వహించారు. చవితి పండుగనాడు ప్రతిష్ఠించిన గణనాథులకు పదకొండు రోజులపాటు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించిన భక్తు లు, నిర్వాహకులు బుధవారం ఉదయం గణనాథులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన తరువాత అలంకరించిన ట్రాక్టర్లలో గణనాథులను ఉంచి గ్రామాల్లోని వీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. కళాకారుల భజనలు, మహిళల బతుకమ్మ ఆట లు, యువకుల నృత్యాలతో శోభాయాత్ర ఆకట్టుకుంది. పొద్దుపోయిన తరువాత గణనాథులను చెరువుల్లో నిమజ్జనం చేశారు.

## బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన



కులకచర్ల, సెప్టెంబర్ 18 : మండల పరిధిలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో బుధవారం బాల్యవివాహాల నిర్మూలనపై సాధన సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మాయిలకు (18), అబ్బాయిలకు (21) ఉంటేనే పెండ్లి చేయాలని, ఆలోపల ఉన్న వారికి వివాహాలు జరిపితే చట్టరీత్యా చర్యలు ఉంటాయని అన్నారు. చట్టాన్ని అతిక్రమించిన వారికి లక్షరూపాయల జరిమానాతో పాటు, జైలు శిక్ష కూడా విధించడం జరుగుతుందన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని కేజీబీవీ పాఠశాల ఎస్‌వో దేవి అన్నారు. బాల్యవివాహాలు చేస్తే జరిగే అనర్థాల గురించి ప్రజలకు అవగాహన కల్పించి పూర్తి స్థాయిలో నిర్మూలించాలని సూచించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు ఈ విషయాన్ని తెలియజేయాలని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సాధన సంస్థ ప్రతినిధులు నర్సింహులు, సంజమ్మ, రామచంద్రయ్య, లీగల్‌సెల్ అథారిటీ అధికారి గౌస్ పాషా, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/శంకర్‌పల్లి, తాండూర్/కొడంగల్ 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం 80966 77962